పునర్విభజన చట్టం అమలులో న్యాయ చిక్కులు

- కోర్టుల్లో బలమైన వాదనలు వినిపించాలి
- అందుకే సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని కోరాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలుపుతూ సిఎల్‌పి తీర్మానం
- కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నేడు నామినేషన్

సిఎల్‌పి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమలులో అనేక రాజ్యాంగ, న్యాయపరమైన చిక్కులు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా చట్టసభల్లో, కోర్టుల్లో సమర్థవంతంగా వాదనలు వినిపించాల్సి ఉందనీ, అందుకే రాజ్యాంగపర అంశాల్లో న్యాయ కోవిదుడు అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాల్సిందిగా కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరామని సిఎం చెప్పారు. తమ ప్రతిపాదనను ఆమోదించిన హైకమాండ్‌కు రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గచ్చిబౌలిలోని షెర్టాన్ హోటల్‌లో ఆదివారం సిఎల్‌పి సమావేశం జరిగింది. తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలుపుతూ సిఎల్‌పి ప్రతిపాదించిన తీర్మానానికి ఎమ్మెల్యేలందరూ ఆమోదం తెలిపారు. సిఎల్‌పి సమావేశానికి పార్టీ ఎమ్మెల్సీలు, ఎంపిలు హాజరయ్యారు. సమావేశం అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 10 గంటలకు రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. వరంగల్‌లో రైతు కృతజ్ఞత సభ త్వరలోనే నిర్వహిస్తామన్నారు. ఈ నెల 20న రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ చేయాలని భావించినా వీలుకావడంలేదని తెలిపారు. రైతు సభ, రాజీవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలపై ఢిల్లీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రేవంత్ తెలిపారు. చట్టం ప్రకారం తెలంగాణ హక్కులపై శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సింఘ్వీ తెలిపారు.

రాజులను చట్టసభల్లోకి తీసుకుంటాం...

విజయానికి, నమ్మకానికి క్షత్రియులు మారుపేరని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో క్షత్రియ సేవా సమితి నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. కష్టపడే గుణం వల్లే క్షత్రియులు ఎక్కడైనా విజయవంతమవుతారని అన్నారు. ఇదే సామాజికవర్గానికి చెందిన ప్రభాస్ తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో బోసురాజు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. "రాజులను చట్ట సభల్లోకి తీసుకోవాలనే ఆలోచన ఉంది. తొలుత పార్టీలో అవకాశం ఇస్తాం.. తర్వాత ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తామని మాట ఇస్తున్నా... విశ్రాంత ఐఎఎస్ శ్రీనివాసరాజును ప్రభుత్వ సలహాదారుగా నియమించాం.. వారి ద్వారా మీరు నన్ను కలవొచ్చు. అల్లూరి సీతారామరాజు, కుమరం భీం స్ఫూర్తితో కొన్నేళ్లుగా పోరాడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. ఫ్యూచర్ సిటీలో రాజులు పెట్టుబడులు పెట్టండి.. మా ప్రభుత్వ సహకారం ఉంటుంది. క్షత్రియ భవన్ కోసం తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తుంది. మళ్లీ క్షత్రియ భవన్‌లో కలుద్దాం" అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకం విడుదల చేసిన గవర్నర్

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

డా. ఎంఎస్ గౌడ్ రచించిన 'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని హైదరాబాద్ రాజ్ భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 'ఈ పుస్తకం చూశాను, ఆయన కృషికి నా అభినందనలు. ఒక దంత వైద్యుడిగా తన ప్రయాణంలో ఎన్నో చేశారు. తెలంగాణలోనే కాకుండా దక్షిణ భారతదేశంలోనూ అత్యుత్తమ దంత వైద్యుడిగా గుర్తింపు పొందారు. పాఠకులకు సులువుగా అర్థమయ్యేలా చెప్పడమే మంచి రచయిత తాలూకా నైపుణ్యం దాగి ఉంటుందని' తెలిపారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ ఎంఎస్ గౌడ్ మాట్లాడుతూ ఈ పుస్తకం నా ఆత్మకథ కాదన్నారు. ఈ పుస్తకం ఒక సాధారణ దంత వైద్యుడి నిజమైన కల అన్నారు. ఈ పుస్తకం సహకారం, ప్రయత్నాల గురించి మాట్లాడుతుందన్నారు. గతంలో చేసిన కఠోర శ్రమ వల్లే ఈ రోజు నేనుగా ఉన్నానన్నారు. తెలు గు రాష్ట్రాల్లో కాస్మొటిక్ డెంటిస్ట్రీని ప్రవేశపెట్టిన మొదటి డెంటిస్ట్ డాక్టర్ నేనేనన్నారు. దంత వైద్యం, దంత వృత్తి ఇమేజ్‌ను నిర్మించడంలో దశాబ్దాలుగా కృషి చేశానన్నారు. దంత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్న నా ప్రయత్నం తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, తమిళం వంటి భాషల్లో దంత సంరక్షణపై పుస్తకాల ద్వారా వచ్చాయన్నారు. డెంటిస్ట్, మెడికల్ డాక్టర్ను సమానంగా తయారు చేయడంలో తన లక్ష్యం నెరవేరిందని ఆయన తెలిపారు.

సిఎం రాఖీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్‌తో పాటు రెండు వందల యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు పథకాలను ఇప్పటికే అమలు చేసిందని గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తగినంత చేయూతను అందిస్తుందని తెలిపారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, ఎక్కడ మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందనీ, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజాపాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు మహిళలకు, రాష్ట్ర ప్రజలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసులతో బ్రీత్ అనలైజర్ టెస్టులు చేయాలి

- మహిళా కమిషన్‌కు మహిళా జూడాల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో కాకుండా రాష్ట్ర పోలీసులు లేదా కేంద్ర బలగాలతో బ్రీత్ అనలైజర్ టెస్టులను చేయించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు హైదరాబాద్‌లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిసి వినతిపత్రం సమర్పించారు. మహిళ వైద్యులకు ప్రత్యేకంగా రెస్ట్ రూంలు, రాత్రి విధుల్లో పురుషులైన కానిస్టేబుళ్లతో పాటు మహిళా కానిస్టేబుళ్లను విధుల్లో ఉపయోగించాలని సూచించారు. ప్రాంగణమంతా 24 గంటల పాటు సిసి కెమెరాల నిఘా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా సంఘటన జరిగితే వైద్యారోగ్యశాఖ మంత్రి లేదా ఆ శాఖ కార్యదర్శిని జవాబుదారిని చేయాలని వేధింపుల నిరోధక కమిటీల ఏర్పాటు, జిల్లా స్థాయిలో వేధింపులకు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఆస్పత్రి లోపలికి వచ్చే ప్రతి ఒక్కరూ స్క్రీన్ మీద కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. నిర్దిష్ట వ్యవధిలోపు కమిటీలను ఏర్పాటు చేయాలనీ, జుడీషియల్ మెజిస్ట్రేట్ క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరారు. రాత్రి విధులు నిర్వహించేందుకు మహిళలకు ఒంటరిగా కాకుండా ఇద్దరు లేదా అంత కన్నా ఎక్కువ మంది కలిసి పని డ్యూటీలు వేసేందుకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సూచించాలని కోరారు.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు

- సర్వాయి పాపన్న ఏలిన కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్దార్ సర్వాయి పాపన్న ఏలిన సర్వాయిపేట, కిలాసాపేట, తాటికొండ, భువనగిరి వంటి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి రూ.4 కోట్లు 70 లక్షలు బడ్జెట్‌లో కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఇందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయత్నం చేశారని తెలిపారు. నగరంలోని ప్రధాన ప్రాంతంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో పాపన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బిసి సంక్షేమ శాఖ, పాపన్న ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాపన్న 374వ జయంతి వేడుకల్లో డిప్యూటీ సిఎం హాజరై మాట్లాడారు. పాపన్న జీవిత కథ చిన్న సంపుటాలుగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పాపన్న ఆశయాలు మేరకే బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సే లక్ష్యంగా పాలన చేస్తున్నామని తెలిపారు. విద్య సామాన్యులకు చేరాలనే లక్ష్యంతో గ్రామాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేసి వాటిని నాలెడ్జ్ సెంటర్లుగా చేసేందుకు రూ. ఐదు వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆత్మ గౌరవం ఉన్న వ్యక్తులు వ్యతిరేక పవనాలను అనుకూలంగా మలచుకుంటారని, ఇందుకు పాపన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పాపన్న జీవిత కథ నేటి యువతకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. పాపన్న 400 ఏళ్ల క్రితమే సామాజిక సమానత్వం కోసం ఉద్యమించారని కొనియాడారు. ఆయన విగ్రహం టాంక్ బండ్‌పై ప్రతిష్ఠిస్తామని చెప్పారు. కుల గణన చేసిన తర్వాత స్థానిక ఎన్నికలు జరుపుతామని చెప్పారు. రెండు లక్షల మంది గీత కార్మికులకు రక్షణ మోకీలు అందిస్తామని, తొలి విడతలో పది వేల మందికి అందించామని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కుల వృత్తులు మారేలా చర్యలు తీసుకొంటామని చెప్పారు. బిసి సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి బూర వెంకటేశం మాట్లాడుతూ.. బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన పాపన్న.. శివాజీకి సమకాలికుడు అని అన్నారు. శివాజీ చరిత్ర ప్రసిద్ధి పొందిన విధంగా పాపన్న చరిత్ర ప్రాచుర్యంలోకి తేవాలని కోరారు. బిసి జాతీయ నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పాపన్న జన్మించిన జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రేమ సాగర్ రావు, డాక్టర్ వకులాభరణం కృష్ణ మోహన్ రావు, పాపన్న ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

రజకులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి

- గ్రామ అభివృద్ధి కమిటీ పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి : పైళ్ల ఆశయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఎనిమిది నెలల నుంచి రజకులపై కొనసాగుతున్న సాంఘిక బహిష్కరణను వెంటనే ఎత్తివేసి, బహిష్కరణకు పాల్పడిన పెత్తందారులను అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో బహిష్కరణకు గురైన బాధితులను కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రజకుల అసైన్‌మెంట్ భూమిని కబ్జా చేయాలని పెత్తందారులు ప్రయత్నించడాన్ని రజకులు వ్యతిరేకించినందుకు సాంఘిక బహిష్కరణ చేసినట్టు.. రజక మహిళలు, యువకులు ఆశయ్య దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో బహిష్కరణకు సంబంధించిన కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో రజకులకు, పసిపిల్లలకు పాలు పోయనీయడం లేదని, కిరాయి ఆటోలు ఎక్కనీయడం లేదని తెలిపారు. కూలీ పనులకు పిలవడం లేదని, రజకుల వ్యవసాయ భూములకు ట్రాక్టర్లను కూడా రానీయడం లేదని, రజకులను ఎవరైనా పనులకు పిలిచినా, సహాయం చేసినా రూ.10వేల జరిమానా విధిస్తామని గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో పెత్తందార్లు హుకుం జారీ చేశారని వివరించారు. బహిష్కరణ చేసి 8 నెలలు గడిచినా.. స్థానిక అధికార యంత్రాంగం పట్టనట్టు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీస్, రెవెన్యూ యంత్రాంగం రజకులకు తగిన రక్షణ కల్పించి సాంఘిక బహిష్కరణను ఎత్తివేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజక ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు గోపనపల్లి శంకర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, రజక ఐక్యవేదిక జిల్లా సాంస్కృతిక కన్వీనర్ జగడం పోషన్న, జక్రాన్‌పల్లి గ్రామ అధ్యక్షులు జగడం భూషణ్, చిక్కాల శ్రావణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు జగడం సురేష్, గ్రామ కమిటీ సభ్యులు జగడం మోహన్, జగడం అభిమన్య, పవన్, పద్మ, శ్యామల, చిన్నుబాయి తదితరులు పాల్గొన్నారు.

గాయని సుశీల త్వరగా కోలుకోవాలి

హైదరాబాద్ బ్యూరో :తెలుగుతో పాటు పలు భాషల్లో వేలాది గీతాలు పాడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన గాయని సుశీల త్వరగా కోలుకోవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. అనారోగ్యంతో చెన్నైలోని అస్పత్రిలో చికిత్స పొందుతున్న సుశీల సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

షాటో కాంపిటేషన్‌లో మహిమల భాస్కర్ రెడ్డికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం నిర్వహించిన రాష్ట్ర స్థాయి న్యూస్ ఫొటో కాంపిటీషన్-2024లో రాష్ట్రంలోని 31 జిల్లాల నుంచి దాదాపు 100 మంది ఫొటో జర్నలిస్టులు తమ ఎంట్రీలను పంపారని తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుమళ్ల గంగాధర్, కె.ఎన్.హరి వెల్లడించారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన న్యూస్ ఫొటో కాంపిటీషన్-2024 ఛాయాచిత్ర ప్రదర్శనలో సీనియర్ జర్నలిస్ట్, సిఎం సిపిఆర్ఒ బి.అయోధ్యరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సిహెచ్.శుశీల్ రావు, సీనియర్ ఫొటో జర్నలిస్టు హెచ్.సతీష్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ఉత్తమ వార్తా చిత్రాలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, మహిమల భాస్కర్‌రెడ్డి, వెలుగు (సిద్దిపేట), ద్వితీయ బహుమతి రూ.8 వేలు, పి.సురేంద్ర, డెక్కన్ క్రానికల్ (హైదరాబాద్), తృతీయ బహుమతి రూ.5 వేలు ఎ.తరుణ్, టైమ్స్ ఆఫ్ ఇండియా (హైదరాబాద్) ఎంపికయ్యారు. 25 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

పోస్ట్ చేసేముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలి

హైదరాబాద్ బ్యూరో : సామాజిక మాధ్యమాల్లో ఏదైనా పోస్ట్ చేసే ముందు దానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. అంతకు ముందు కెటిఆర్, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల జీతాలిస్తున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటున్నదంతా అబద్ధమని ట్వీట్ చేశారు. సూర్యా పేట ప్రభుత్వాస్పత్రి ఉద్యోగి వసీం ఆత్మహత్య తెలిపారు. ఇందుకు బదులుగా మంత్రి దామోదర రాజనర్సింహ రీట్వీట్ చేస్తూ, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్న ఘటనను రాజకీయాలకు వాడుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వసీంకు బకాయిలో ఉన్న ఒక నెల వేతనం చెల్లించడానికి ప్రాసెస్‌లో ఉందని తెలిపారు.

కలకత్తా డాక్టర్ ఘటనలో..

హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం

- బెంగాల్ ప్రభుత్వం నిందితులను రక్షించే చర్యలు దారుణం
- బెంగాల్ సిఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలి
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోల్‌కతా నగరంలో ట్రైనీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసనలు వెల్లువెత్తాయి. కొవ్వొత్తుల ర్యాలీలు, కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయం సుందరయ్య భవనం నుంచి నిర్మల్ హృదయ్ హైస్కూల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కోల్‌కతా నగరంలో ట్రైనీ డాక్టర్‌పై సభ్య సమాజం తలదించుకొనే విధంగా లైంగికదాడి చేసి అనంతరం అతి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసును ఆత్మహత్యగా చిత్రీకరించి ఘటనకు పాల్పడిన నిందితులను కాపాడటానికి ఆనవాళ్లు లేకుండా చేయడానికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఆ కాలేజీ ప్రిన్సిపల్‌ను అరెస్టు చేయకుండా సాక్ష్యాలను రూపుమాపేందుకు పూనుకుంటుందన్నారు. న్యాయం కోసం ఆందోళన చేస్తున్న వారిపై, ఆస్పత్రిపై టిఎంసి శ్రేణులు దాడులకు పాల్పడుతున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు ప్రవర్తిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ ఇష్టానుసారంగా ప్రయివేటు మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇస్తూ భద్రతను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీలు, హాస్పిటల్స్‌లో మహిళా డాక్టర్లు, నర్సులు, ఇతర మహిళా సిబ్బందికి భద్రత కల్పించాలని కోరారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇల్లందు మండలంలో ఐద్వా మండల కార్యదర్శి ఆలేటి సంధ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. నింధితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం రూరల్‌లో ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఐద్వా పట్టణ కార్యదర్శి డి సీతలక్ష్మి, సీనియర్ నాయకులు నాదెళ్ల లీలావతి మాట్లాడారు. దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షులు పూజల లక్ష్మి పట్టణంలోని ఎఎంసి కాలనీలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దుమ్ముగూడెం మండలంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా మాజీ చైర్మన్ కనుబుద్ధి దేవా ఆధ్వర్యంలో లక్ష్మీనగరం సెంటర్‌లో బాధితురాలి చిత్రపటానికి నివాళులు అర్పించి, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, మహిళా రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు చెప్పాల బాలమణి మాట్లాడుతూ.. మహిళా ముఖ్యమంత్రి ఉన్న చోట మహిళలకు రక్షణ కరువవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు పెర్క అంజి, ఉపాధ్యక్షులు బత్తుల అభిషేక్, భాను, నవ నవదీప్, చిక్కి, పండు తదితరులు పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద సిపిఐ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజపేట మండలంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని మీనా ఇంజనీరింగ్, నర్సింగ్ కాలేజ్ వద్ద విద్యార్థులతో కలిసి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ.. మహిళల రక్షణకు ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించి 30 రోజుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేరుకు 'బెస్ట్'.. పనులు వరెస్ట్

- ఉత్తమ అధికారిగా అవార్డు.. మూడు రోజుల్లోనే సరెండర్
- విధుల్లో నిర్లక్ష్యం, అవకతవకలతో డిఎంహెచ్ఒపై వేటు
- లైంగిక వేధింపుల ఆరోపణలతో డిపిఒ సరెండర్
- చర్చనీయాంశంగా ఉత్తమ అవార్డు అధికారిరులు తీరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ అధికారిగా ఉత్తమ సర్వీసు అందించిన ఉద్యోగులకు అవార్డులిస్తుంటారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున, జనవరి 26 గణతంత్ర దినోత్సవం నాడు, జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం...ఇలా పలు సందర్భాల్లో ఈ అవార్డులు ప్రదానం చేయడం ఆనవాయితీ. కానీ ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగులకు దక్కాల్సిన అవార్డులు పైరవీలతో పక్కదారి పడుతున్నాయని వింటుంటాం. దానికి నిదర్శనమే ఈ ఘటన. ఖమ్మం జిల్లా వైద్యాధికారి బోడ మాలతి.. ఆగస్టు 15 సందర్భంగా గురువారం నాడు ఉత్తమ జిల్లా అధికారిగా అవార్డు తీసుకున్నారు. సరిగ్గా మూడు రోజులైందో.. లేదో.. విధి నిర్వహణలో ఆమె వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెతో పాటు జిల్లా పంచాయతీ అధికారి ఈ. హరికిషన్‌ను సైతం బాధ్యతల నుంచి తప్పించారు. ఒకేరోజూ ఇద్దరు అధికారులను.. అందునా ఉత్తమ అవార్డు అందుకున్న మూడురోజులకే సరెండర్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

డిఎంహెచ్ఒ విధి నిర్వహణలో అవకతవకలు, అద్దె వాహనాల విషయంలో ఆరోపణలు, ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా తన తల్లిపేరుతో ఉన్న కారును అద్దెకు పెట్టడం, ప్రయివేటు హాస్పిటల్స్ అనుమతులు, పునరుద్ధరణకు సంబంధించి ఇన్‌వార్డు, ఔట్‌వార్డులో లొసుగులు, ఔట్‌వార్డు రిజిస్టర్ మెయింటెన్ చేయకుండా ముడుపులు ఇస్తేనే అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు, హైదరాబాద్ నుంచి వచ్చే అధికారులకు రూ.లక్షలు ఖర్చు పెట్టడం, తనకు అనుకూలంగా వ్యవహరించే ఉద్యోగులకు పెద్దపీట వేయడం.. లేదంటే కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం.. ఇలాంటి అనేక ఆరోపణలతో ఆమెకు డిపార్టుమెంట్‌పై అజమాయిషీ తగ్గిందనే వాస్తవాలను పై అధికారులు గుర్తించారు. ఆమెపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు సైతం విచారణ నిర్వహిస్తున్నారు. వరంగల్ రీజియన్ విజిలెన్స్ అధికారికి అప్పట్లో సిఎం పేషీ నుంచి ఖమ్మం జిల్లా డిఎంహెచ్ఒపై దృష్టి సారించాల్సిందిగా ఆదేశాలు అందాయి. ఇవన్నీ ఉన్నా ఆమె మంత్రులు, వైద్యారోగ్యశాఖ మంత్రిత్వశాఖలో కొందరి పైరవీతో జిల్లాలోనే కొనసాగుతున్నారు. తన రిటైర్మెంట్‌కు మరో మూడునెలలు అంటే నవంబర్ వరకు మాత్రమే సమయం ఉండటంతో పై అధికారులు కూడా చర్యల విషయంలో ఉపేక్షించారు. వీటితో పాటు ఇటీవల జిల్లాలో డెంగ్యూ కేసులు విచ్చలవిడిగా పెరిగాయి. జ్వరాలు విపరీతంగా ప్రబలుతున్నా శాఖాపరంగా నామమాత్రపు చర్యలే ఉండటం, ప్రయివేటు ఆస్పత్రులపై అజమాయిషీ లేని కారణంగా డిఎంహెచ్ఒను ప్రభుత్వానికి సరెండర్ చేసినట్టు తెలుస్తోంది.

డిపిఒ హరికిషన్‌ది మరో కథ..

జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ మహిళా ఉద్యోగులతో అసభ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు న్నాయి. దీనిపై బాధిత మహిళా ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయన్ను పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు సరెండర్ చేశారు.పాటు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య చర్యల విషయం లోనూ డిపివొ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

అదనపు బాధ్యతలు..

జిల్లా పంచాయతీ అధికారి స్థానంలో జడ్‌పి డిప్యూటీ సిఇఒగా పనిచేస్తున్న నాగలక్ష్మికి అదనపు బాధ్యతలు ఇచ్చారు. జడ్‌పి సిఇఒ వినోద్ బదిలీ అయినప్పటి నుంచి ఆమె సిఇఒగా అదనపు బాధ్యతలు చూస్తున్నారు. ఆమె ఇప్పుడు డిపిఒగానూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇక డిఎంహెచ్ఒను వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖకు సరెండర్ చేశారు. ఆరోగ్యశాఖ కమిషనర్, పూర్వ కలెక్టర్ ఆర్వీ కర్ణన్ జిల్లా పర్యటనలో డెంగ్యూ కేసుల నమోదు, రోగులకు చేసే పరీక్షల్లో లోపాలతో ఆయన అసహనానికి లోనయ్యారు. ఫలితంగా కలెక్టర్‌కు సరెండర్ చేశారు. ఆమె స్థానంలో జిల్లా కుష్టు నియంత్రణాధికారిగా పనిచేస్తున్న వరికూటి సుబ్బారావుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఉత్తమ అవార్డు అందుకున్న డిఎంహెచ్ఒపై వారం తిరక్కముందే వేటు పడటం.. ఎంపికలో లోపాలను ఎత్తిచూపుతోందనే చర్చ మొదలైంది.

చదువంటే సమాజాన్ని సంస్కరించే జ్ఞానం

- పిల్లల్లారా..సమయాన్ని సద్వినియోగం చేసుకోండి
- తల్లిదండ్రుల్లారా.. ఇతర యాక్టివిటీల్లోనూ ప్రోత్సహించండి
- రోజుకో కొత్త విషయం నేర్పుతూ ప్రపంచ జ్ఞానాన్ని అందించండి
- జనగణమన జయకేతనం సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చదువంటే కేజీలు.. పిజిలు.. బీటెక్‌లు.. ఎంటెక్‌లు.. ర్యాంకులు కానేకాదని, చదువంటే సమాజాన్ని సంస్కరించే జ్ఞానమని రాష్ట్ర సాంస్కృతిక, టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నొక్కిచెప్పారు. దేశభక్తిని పిల్లల్లో పెంపొందించేందుకు ఇలాంటి బృహత్కర కార్యక్రమాన్ని తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించడం ఇదే తొలిసారి అంటూ బాలోత్సవ కమిటీ నిర్వాహకులను అభినందించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో 'జనగణమన జయకేతనం.. దేశభక్తి గీతాలకు నృత్యనీరాజనం' పేరుతో విద్యార్థులు నృత్యప్రదర్శనలు చేశారు. దేశభక్తి గీతాలను పాడి వినిపించారు. 'మత్తు మహమ్మారిని రాష్ట్రం నుంచి తరిమికొడతాం.. యువతను కాపాడుకుందాం' అంటూ కార్యక్రమానికి హాజరైన ప్రతిఒక్కరూ ప్రతినబూనారు. పిల్లల కళాప్రదర్శనల అనంతరం మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ..బాల్యంలో ప్రతి క్షణమూ విలువైనదేనని, దాన్ని తిరిగి పొందలేమని చెప్పారు. పిల్లలు టివిలు, ఫోన్లకు అలవాటు పడకుండా ప్రాపంచిక జ్ఞానం పెంపొందించుకునే దిశగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొద్దస్తమానం చదువు..చదువు..అని పిల్లలను ఇబ్బంది పెట్టకూడదనీ, చదువుతో పాటు ఇతర యాక్టివిటీల్లోనూ పాల్గొనేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రోజూ ఏదో ఒక కొత్త అంశాన్ని నేర్పాలని సూచించారు. అప్పుడే పిల్లలు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారని చెప్పారు. జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లలు చెడిపోవడం ఖాయమని హెచ్చరించారు. ఫెయిల్ అయ్యామని కొందరు పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఓటమిని గెలుపునకు పునాదిగా మలుచుకునేలా పిల్లలను తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. సంస్కృతి అంటే జీవన విధానమనీ, నేడు సమాజంలో ఆ జీవన విధానం ధ్వంసమైపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా అనేక అనర్థాలు జరిగిపోతున్నాయని వాపోయారు. అన్ని రంగాల్లో, అన్ని వర్గాల్లో సంస్కృతి చిన్నాభిన్నమైందని వాపోయారు. సమాజం ఇలా కావడానికి మనమే కారణమని ఎత్తిచూపారు. సృష్టిలో మానవ జన్మ అనేది ఉత్కృష్టమైందని అన్నారు. ఆలోచన అనేది మనిషికే ఉందని, ఇతర జీవులకు అది లేదని చెప్పారు. స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్, చెడు అలవాట్లకు విద్యార్థులు, యువకులు గురికావడం సమాజానికి శ్రేయస్కరం కాదన్నారు. జీవితానికి సార్థకత ఉండాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. ఏ పనిచేసేటప్పుడైనా మనకుమనం ప్రశ్నించుకోవాలనీ, అప్పుడే మన నిర్ణయాలు సరిగా ఉంటాయని చెబుతూ పలు ఉదహరణలను వివరించారు. రాష్ట్రంలో రకరకాల కళలున్నాయని, సినిమాలతో అవి మరుగున పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని ప్రోత్సహిస్తున్న బాలోత్సవం కమిటీని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. కళారూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని నొక్కి చెప్పారు. పిల్లలకు ధైర్యసాహసాలు, వినయవిధేయతలు, కళలు, ఆటపాటలు నేర్పాలని కోరారు. అమెరికా లాంటి దేశాల్లో వారానికి రెండు రోజులు టూర్లకు వెళ్తారనీ, మనదగ్గర అది లేదని చెప్పారు. నెలలో ఒక్కరోజైనా తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని కొత్త ప్రాంతానికి వెళ్లాలనీ, ఆ ప్రాంత విశేషాలను పిల్లలకు చెప్పాలని సూచించారు. టూరిజాన్ని ప్రోత్సహించడం వల్ల ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు. రిటైర్డ్ ఐఎఎస్ డాక్టర్ కెవి రమణా చారి మాట్లాడుతూ.. పిల్లలు నిరంతం ఉత్సాహంగా, ఉత్తేజంగా ఉండేందుకు బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. పిల్లలు చిన్నప్పుడు వేసిన నాటికలు వారి జీవితాన్ని తీర్చిదిద్దడంతో దోహదపడుతాయని చెప్పారు. పిల్లలు భవిష్యత్తులో ఎదిగితేందుకు ఒక ప్రణాళిక ఉండాలనీ, అందులో తల్లిదండ్రుల పాత్ర కీలకమని చెప్పారు. చదువుకుంటే పుస్తకాల్లో ఉండేది మాత్రమే తెలుస్తుందన్నారు. పిల్లలకు ప్రాపంచిక జ్ఞానం కూడా అవసరమనీ, అది భవిష్యత్తులో మెరుగైన జీవనానికి దోహదపడుతుందని చెప్పారు. 32 సంస్థల వాళ్లు ఆనందకరంగా కార్యక్రమం నిర్వహించడం బాగుందన్నారు.

రమణిసిద్ధి, పరాశరం, రేణుకాప్రభాకర్, భావనాదీప్తి, రోహిణి.కె, శ్రీనివాస్, రాజేశ్వర్, మిగతా గురువులందరికీ శిరస్సు వహించి నమస్కరించారు. తెలంగాణ బాలోత్సవం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు తన వంతుగా పెన్షన్ నుంచి రూ.25 వేలు ఇస్తున్నట్టు సభా వేదిక నుంచి ప్రకటించారు. బాలోత్సవం ఉపాధ్యక్షులు సుజావతి మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రజాపాటకు నృత్యనీరాజనం, ప్రపంచ డ్యాన్స్ దినోత్సవం, జనగణమన జయకేతనం వంటి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. బాలోత్సవం కార్యక్రమానికి గురువుల సహకారం మరువలేనిదని కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ఎస్‌వికె మేనేజింగ్ ట్రస్టు కార్యదర్శి ఎస్ వినయకుమార్, నృత్యగురువు హిందులత, ఉపాధ్యక్షులు మమత, రూపారుక్మిణి, ఎస్‌వికె నిర్వాహకులు బుచ్చిరెడ్డి, నృత్యగురువు పరాశరం తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- రాహుల్, ఖర్గేకు కెటిఆర్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీ పేరుతో మోసం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆ పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. "వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ హామీ ఇచ్చింది.. కానీ రాష్ట్ర ప్రభుత్వం అనేక షరతులు పెట్టి 40 శాతం మందికి మాత్రమే మాఫీ చేసింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణమాఫీ చేయాలి" అని లేఖలో కెటిఆర్ డిమాండ్ చేశారు. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రూ. లక్ష రుణమాఫీ చేస్తేనే రూ.17 వేల కోట్లు ఖర్చు కాగా, 36 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరిందని పేర్కొన్నారు. "రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్క ప్రకారం 47 లక్షల మంది రైతులకు, రూ.2 లక్షల రుణమాఫీకి రూ.49,500 కోట్లు అంచనా వేశారు. రాష్ట్ర కేబినెట్ సమావేశం వరకు రూ. 31 వేల కోట్లకు కుదించారు. రాష్ట్ర బడ్జెట్‌లో మరింత కోత పెట్టి రూ. 26 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. తీరా మూడు విడతల రుణమాఫీ తతంగాన్ని రూ.17,933 కోట్లతో మమ అనిపించారు" అని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ గ్రామంలో చూసినా సగానికి పైగా అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ చెబుతున్నట్టు రూ. రెండు లక్షల రుణమాఫీ పూర్తయితే, లబ్దిదారుల సంఖ్యతోపాటు చెల్లింపు మొత్తం ఎందుకు రెట్టింపు కాలేదని ప్రశ్నించారు. అర్హులైన రైతులందరికీ వెంటనే రుణ మాఫీ చేయాలని కోరారు.

బిఆర్ఎస్ అవుట్‌డేటెడ్ పార్టీ

- విలీనం, పొత్తులు గంగలో కలవనీయండి
- కేంద్ర మంత్రి బండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అవుట్‌డేటెడ్ పార్టీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. ఆ పార్టీ విలీనం, పొత్తులు గంగలో కలువనీయండి..వాటితో ప్రజలకేం సంబంధం అంటూ ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కోఠిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కెసిఆర్, కెటిఆర్ పేరెత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఉందన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేల అవసరం కాంగ్రెస్‌కే ఉందని చెప్పారు. అవినీతి కూపంలో కూరుకుపోయిన బిఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం బిజెపికి లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో రుణమాఫీ కాక రైతులు కాంగ్రెస్ దిష్టిబొమ్మలు తగలబెడుతుంటే కాంగ్రెస్ సర్కారుకు పట్టదా? అని ప్రశ్నించారు. రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను పక్కదోవ పట్టించేందుకే బిఆర్ఎస్ విలీన డ్రామాలను సిఎం రేవంత్‌రెడ్డి తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఈ విషయంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ డ్రామా ఆడుతున్నాయన్నారు. 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 22 లక్షల మందికే మాఫీ చేస్తారా? మిగతావారి సంగతేంటి? అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో రూ.40 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారని, బడ్జెట్లో రూ.26 వేలు కేటాయించి చివరకు రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని విమర్శించారు.

యంగ్‌మెన్స్ ఇంప్రూవ్ మెంట్ సొసైటీ సేవలు చిరస్మరణీయం : బండి

పేదలకు విద్య, వైద్యంతో పాటు జాతీయవాదం, వ్యక్తిత్వ వికాసంపై యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు యంగ్ మెన్స్ ఇంప్రూవ్ మెంట్ సొసైటీ చేస్తున్న సేవలు చిరస్మరణీయమని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

ఆదివారం హైదరాబాద్‌లోని కోఠిలో యంగ్ మెన్స్ ఇంప్రూవ్ మెంట్ సొసైటీ భవన ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మత, వర్గాలు, సంఘాల పేరిట చీల్చే కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు శ్యామ్‌జీ, రామకృష్ణ పరమహింస మిషన్ నుంచి స్థితికంఠానంద స్వామిజీ, పద్మాకర్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీలో జాప్యం

- తగ్గిన ఆయుర్వేద యుజి సీట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు ఇంకా కొనసాగుతుండటంతో వరంగల్ ఆయుర్వేద కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి చెందిన యుజి సీట్ల సంఖ్య తగ్గినట్టు తెలిసింది. అవసరమైన సబ్జెక్ట్ కావాల్సిన బోధన సిబ్బంది లేకపోవడంతో 'నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ '(ఎన్ సిఐఎస్ఎం) యుజి సీట్లను 59 నుంచి 47కు తగ్గించారు. వరంగల్ కళాశాలను సందర్శించి, అక్కడి వాతావరణం, సిబ్బంది తదితర అంశాలను పరిశీలించిన అధికార బందం నిబంధనల మేరకు అవసరమైన సబ్జెక్ట్‌లకు తగిన సిబ్బంది లేదని గుర్తించినట్టు సమాచారం. దీంతో 2024-25 విద్యాసంవత్సరానికి సీట్లను తగ్గించారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఉంటే ప్రస్తుతం సీట్ల సంఖ్య తగ్గే అవకాశాలు లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయుర్వేద కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి వైద్యారోగ్యశాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. సుమారు 36 పోస్టులు ఖాళీగా ఉండగా, వీటి నియామకానికి ఆర్థిక శాఖ నుంచి అనుమతి కూడా లభించింది. దీంతో త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తారని గత కొంత కాలంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ నోటిఫికేషన్ మాత్రం జారీ కాలేదు. ఈ పోస్టుల కోసం దశాబ్దకాలంగా సుమారు రెండువేల మంది ఆశలు పెట్టుకున్నారు.

ఈ పోస్టుల భర్తీ అంశంలో రాజకీయ ప్రమేయం ఉన్నట్టు ఆయుర్వేద కళాశాల వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వం నుంచి మొదలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు కొందరు ఉద్యోగుల అడ్డుపడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది వరకే ఖాళీ పోస్టులను భర్తీ చేసి ఉంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో యుజి సీట్ల సంఖ్య తగ్గే అవకాశాలు ఉండేవి కావని కొందరు చెబుతున్నారు. మరోవైపు కొందరు అధికారులు పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం వద్ద లాబీయింగ్ చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

వరంగల్ ఆయుర్వేద కళాశాలలో డిప్యూటేషన్ అధికారులు తిష్టవేశారు.అవసరమైన సబ్జెక్టులకు కాకుండా, ఇతర సబ్జెక్టులకు మాత్రం అవసరానికి మించి డిప్యూటేషన్ పద్ధతిన బోధన సిబ్బంది ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుతం సుమారు 14 మంది వరంగల్ ఆయుర్వేద కళాశాలలో పనిచేస్తున్నారు. క్లినికల్ వైపు పని చేస్తున్న కొందరు మెడికల్ ఆఫీసర్లు ఆయుర్వేదంలో తిష్టవేశారు.వారు ఆయుర్వేద కళాశాలలో పని చేస్తుండడంతో అక్కడ కొరత ఏర్పడింది. దీంతో అక్కడున్న ఉద్యోగులపైన అదనపు భారం పడుతోంది.

ఎసిబికి చిక్కిన ఇఒ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేవాలయ ఆవరణలో సామగ్రి, పూజా సామగ్రి విక్రయిస్తున్న యజమాని నుంచి దేవాలయ ఇవో రూ.20వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో ఆదివారం చోటు చేసుకుంది. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ దేవాలయంలో ఈవోగా విధులు నిర్వహిస్తున్న బిక్షమాచారి దేవాలయ ఆవరణలో పూజా సామగ్రి విక్రయిస్తున్న దుకాణ యజమాని సాంబయ్యను మూడు సంవత్సరాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ప్రతి ఏడాది డబ్బులు వసూలు చేస్తుండటమే కాకుండా కొద్ది రోజులుగా డబ్బులు ఇవ్వాలని, లేదంటే దుకాణం తీసేయాలని బెదిరించసాగాడు. దాంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఆదివారం దేవాలయంలోని కౌంటర్ వద్ద బిక్షమాచారికి రూ.20వేలు ఇస్తుండగా ఎసిబి డీఎస్పీ సాంబయ్య, ఎస్ఐ శ్యాంసుందర్ రాజు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నారు.

బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపిపి ఆత్మహత్యాయత్నం

- మంచిర్యాల ఎసిపి కార్యాలయంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీ 21వ వార్డ్ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు బేర సత్యనారాయణ ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. భూవివాదంలో ఆదివారం ఎసిపి కార్యాలయానికి వచ్చిన సత్యనారాయణ కత్తితో గొంతు కోసుకున్నారు. గాయపడ్డ ఆయనను పోలీసులు పట్టణంలోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్‌లో సత్యనారాయణ మాట్లాడుతూ.. రాజకీయంగా తనను అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే పోలీసుల సాయంతో తనపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో తన కూతురు ఇంట్లో ఉండగా అక్కడి నుండి పోలీసులు మంచిర్యాలకు తీసుకొచ్చారని తెలిపారు. సామాన్య కార్యకర్త నుంచి ఎదిగిన తనను రాజకీయంగా అణగదొక్కేందుకు పోలీసులు, ఎమ్మెల్యే కలిసి ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించాడు. అనంతరం ఆయనను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేర సత్యనారాయణపై అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణకు రావాల్సిందిగా కోరామని ఎసిపి ఆర్.ప్రకాష్ తెలిపారు. ఆదివారం ఉదయం కార్యాలయానికి వచ్చి ఇంతలోనే ఇలా చేశారని తెలిపారు.

సర్వాయి పాపన్న విగ్రహం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు

- రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సర్వాయి పాపన్న విగ్రహాని కాంగ్రెస్ ప్రభుత్వం్న ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు. పాపన్న గౌడ్ 374 జయంతి సందర్భంగా ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలపై కొనసాగిన అణిచివేత, దాడులకు వ్యతిరేకంగా పోరాడిన మహాయోధుడని కొనియాడారు. పాపన్న ఆలోచన విధానాన్ని యువత కొనసాగించాలని పేర్కొన్నారు. గౌడ సామాజిక వర్గ సంక్షేమానికి కెసిఆర్ ప్రభుత్వం ఎంతో చేసిందని, ఆదే తరహాలో కాంగ్రెస్ సర్కార్ సైతం అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

అవయవ దానంతో ఆరుగురికి పునర్జన్మ

- పుట్టెడు దుఖంలోనూ మాతృమూర్తి ఔదార్యం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన కుమారుడిని చూసి పుట్టెడు దుఖంలో ఉన్న ఆ మాతృమూర్తి తీసుకున్న నిర్ణయం మరో ఆరుగురికి పునర్జన్మనిచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ద్యానబోయిన నర్సింలు- దేవలక్ష్మికి కుమారడు ద్యానబోయిన నరేష్ (27), కూతురు నవిత ఉన్నారు. ద్యానబోయిన నర్సింలు రెండేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పులు తీర్చడానికి, కుటుంబానికి అండగా నిలబడడానికి నరేష్ గల్ఫ్ దేశం వెళ్లి వచ్చి సోదరి పెండ్లి చేశాడు. ఐదు నెలల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. గత మంగళవారం లింగన్నపేట గ్రామంలో నరేష్ బంధువులు చనిపోగా వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో మండల కేంద్రంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో నరేష్ తలకు తీవ్ర గాయమైంది. చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బ్రెయిన్ డెడ్ అయినట్టు తెలిపారు. ఈ క్రమంలో అవయవ దానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. దాంతో కొడుకు దక్కడనే బాధను దిగమింగుకుని మరో ఆరుగురికి పునర్జన్మ ఇచ్చేందుకు తల్లి ముందుకువచ్చింది. అవయవదానానికి తల్లి సుముఖత చూపడంతో రెండు మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె తీసి జీవన్ దాన్ ద్వారా భద్రపరిచారు. నరేష్ భౌతికంగా లేకున్నా అవయవాల వితరణతో మరో ఆరుగురికి అవయవ దానం చేయడం పట్ల నరేష్ మాతృమూర్తిని పలువురు అభినందించారు. భర్త నర్సింలు, కొడుకు నరేష్ ఇద్దరూ మృతిచెందడంతో కుటుంబం దిక్కులేని స్థితిలో పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం.. ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బస్తీ దవాఖానాలలో సిబ్బంది కొరత

- రెగ్యులర్ పోస్టులు రావడంతో పలువురు డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్ల రాజీనామా
- ఉన్న సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిన్న చిన్న రోగాలు వస్తే ప్రాథమిక దశలో పేదలకు వైద్యమందించేందుకు బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌లను స్ఫూర్తిగా తీసుకుని తొలుత హైదరాబాద్, ఆ తర్వాత జిహెచ్ఎంసి పరిధికి విస్తరించారు. వాటికి మంచి స్పందన లభించడం, పేద రోగులకు సేవలందడం, పెద్దాస్పత్రులపై చిన్న చిన్న రోగాల బారిన పడిన వారి రద్దీ తగ్గడం, బోధనాస్పత్రుల్లో వైద్యులు సంక్లిష్ట కేసులపై శ్రద్ధ చూపించేందుకు సానుకూలత ఏర్పడటం వంటి విజయాలు బస్తీ దవాఖానాల ఏర్పాటు తర్వాత గమనించారు. పరిమిత సంఖ్యలో ప్రారంభమైన బస్తీ దవాఖానాల సంఖ్య క్రమేణా పెంచుతూ దాదాపు 500 వరకు విస్తరించారు. ఒక బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్స్ తో పాటు సపోర్టింగ్ స్టాఫ్‌ను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించి సేవలందించారు.

ఇటీవల స్టాఫ్ నర్సుల రెగ్యులర్ పోస్టుల అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో దాదాపు 90 మంది స్టాఫ్ నర్సులు బస్తీ దవాఖానాల్లో సేవలకు రాజీనామా చేసి వెళ్లిపోయారు. అదే విధంగా రెగ్యులర్ పోస్టులు వచ్చిన డాక్టర్లతో పాటు వివిధ కారణమాలతో రాజీనామాలు చేసిన వారు దాదాపు 50 మంది వరకున్నట్టు సమాచారం. వీరు వెళ్లిపోయిన తర్వాత ఆ స్థానాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయకపోవడంతో పలు బస్తీ దవాఖానాలు సేవల విషయంలో నామమాత్రంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. డాక్టరు ఉన్న చోట స్టాఫ్ నర్సు లేరు. స్టాఫ్ నర్సు ఉన్న చోట డాక్టర్ లేరు. ఇలా బస్తీ దవాఖానాల పరిస్థితి తయారైందనే విమర్శలు వస్తున్నాయి.

బస్తీ దవాఖానాల్లో ఖాళీల భర్తీని వెంటనే చేపట్టకపోవడంతో సిబ్బంది కొరత వెక్కిరిస్తున్నది. దీంతో పర్యవేక్షణాధికారులు ఇలాంటి ఇబ్బందులున్న బస్తీ దవాఖానాల విషయంలో ఒక్కో స్టాఫ్ నర్సుకు, డాక్టర్ రెండేసి బస్తీ దవాఖానాల బాధ్యతలను అప్పగించినట్టు తెలుస్తున్నది. గతంలో రెగ్యులర్ టెస్టులు, డాక్టర్ కన్సల్టేషన్ అందుబాటులో ఉన్న బస్తీ దవాఖానాలు కూడా అవి రెగ్యులర్‌గా కాకుండా సర్దిబాటు సమయాల్లో మాత్రమే వాటిని చేస్తున్నారు.

మరీ ఇబ్బందిగా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా ఆస్పత్రులకు వెళ్లాలని ప్రజలకు సూచిస్తున్నారు. దీంతో బస్తీ దవాఖానాల ఏర్పాటు మౌలిక లక్ష్యమే దెబ్బతింటున్నదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీ అయిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచిస్తున్నారు. దీనికి తోడు ఉన్న సిబ్బందికి గత నాలుగు నెలల నుంచి జీతాలు పెండింగ్‌లో ఉండటంతో వారిలో నైరాశ్యం నెలకొంది. పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం ఉండటం లేదని వాపోతున్నారు. ఆ జీతాలను వెంటనే విడుదల చేసి, ఖాళీలను భర్తీ చేస్తే బస్తీ దవాఖానాల ఏర్పాటు ఉద్దేశం నెరవేరుతుంది.

పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో రాజకీయాల్లో రాణించాలి

- ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం నెలకొల్పాలి
- జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలి
- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో రాజకీయాల్లో రాణించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ అన్నారు. తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం, కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ విగ్రహానికి కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మెన్ బాలగోని బాలరాజు గౌడ్.. తాటి, ఈత కమ్మల దండ వేశారు. అనంతరం ఎంవీ రమణ మాట్లాడుతూ.. జమీందారులు, జాగీర్దారుల అరాచకాలను సహించలేక కల్లు గీసే కత్తిని పక్కకు పెట్టి ఖడ్గం చేతబట్టి మొగలుల ఆధిపత్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటను జయించిన మొనగాడు సర్దార్ సర్వాయి పాపన్న అని అన్నారు. ప్రతి ఏడాది లాగానే కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న 'అమరుల యాదిలో..' కార్యక్రమం ద్వారా హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని యాది చేసుకుంటున్నామని చెప్పారు. గౌడుల ఆరాధ్యడు కాటమయ్య స్ఫూర్తితో వన సంరక్షణ చేపట్టాలని, పాపన్న స్ఫూర్తితో రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి సర్కార్ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా కుల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని తెలిపారు. ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం నెలకొల్పాలని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్, కెజికెఎస్ హైదరాబాద్ కన్వీనర్ ఎం కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలి

- డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గంజాయి, డ్రగ్స్ మహమ్మరిని తరిమికొడదామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) పిలుపునిచ్చింది. ఈమేరకు ఆదివారం డివైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నాంపల్లి జోన్ హమ్మద్‌నగర్ బస్తీలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ హాజరై మాట్లాడారు. నేటి యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అత్యంత ప్రమాదకరమైన మత్తు పదార్థాలను సేవించడంతో సకల అనర్థాలకు కారణమవుతున్నారన్నారు. నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ దందా విస్తరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బడిపిల్లల నుంచి వర్సిటీ విద్యార్థులు, రోజు కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు ముఖ్యంగా సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఈ మత్తు మహమ్మారికి బానిసలౌతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరంతరమైన నిఘాను ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ నిర్మూలించాలని డిమాండ్ చేశారు. యువత ఉన్నతమైన స్థానాల్లో ఉండి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థులు, యువత బహుముఖ సేవా కార్యక్రమాల్లో, డీవైఎఫ్ఐ నిర్వహించే అహగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎండీ జావెద్, అధ్యక్షులు హాస్మి బాబు, ఉపాధ్యక్షులు అర్షద్, రవి, కలిమ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్, నాగేందర్, అబ్బు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందిన సంఘటన కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని ఏల్లూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కొమురయ్య, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిడం శ్రీనివాస్ (46) అనే రైతు తన పొలంలో వరినట్లు వేయడానికి వెళ్లాడు. సాయంత్రం భారీ వర్షం కురిసింది. అయినా వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కొమురయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య కాంతా, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని వినోబా నగర్ గ్రామంలో సదానందం పశువుల శాలలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు 12 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో ఐదు గొర్రెలు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని బాధితుడు సదానందం వాపోయాడు. మరణించిన గొర్రెల విలువ సుమారు రూ. రెండు లక్షల పైనే ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.